నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

మంగళవారం 3 అక్టోబర్ 2023
TUESDAY, OCTOBER 3, 2023

RANGAREDDY

పేజీలు : 12
PAGES





మహేశ్వరంలోని మన్‌సాన్‌పల్లిలో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చిత్రంలో వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



### నా ఓటు సీఎం కేసీఆర్‌కే : నేరేటి అలివేలు

నేను మూసారాంబాగ్ దగ్గర ఉంటున్నా. కుటుంబ పోషణ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి పదేండ్లు అవుతున్నది. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే జీవిస్తున్నా. నాకు భర్త లేడు. ఇద్దరు పిల్లలున్నారు. ప్రతినెలా పింఛన్ డబ్బులు వస్తున్నాయి. వాటితోపాటు ప్రైవేట్ జాబ్ చేయడంతో నెలకు రూ.12 వేల వరకు జీతం వస్తున్నది. అందులోంచి రూ.4 వేలు ఇంటి అద్దెకే పోతున్నది. నాకంటూ సొంతిల్లు ఉంటుందని కలలోనూ అనుకోలేదు. కానీ, నా కలను సీఎం కేసీఆర్ సార్ నిజం చేశారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం.. బతికినంత కాలం నా ఓటు సీఎం కేసీఆర్ సార్‌కే వేస్తా.

# సొంతింటి కానుక ఆనందాల వేడుక

## సందడిగా డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ

- మన్‌సాన్‌పల్లిలో మంత్రి సబితారెడ్డి, శంకర్‌పల్లిలో మంత్రి మహేందర్‌రెడ్డి లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేత
- నార్సింగి, బైరిగూడలలో ఎంపీ రంజిత్‌రెడ్డి, గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి , నల్లగండ్లలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పంపిణీ
- సకల సౌలత్‌లతో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు : విద్యాశాఖ మంత్రి
- సంక్షేమంలో తెలంగాణ నంబర్‌వన్ : గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి
- సొంతింటి కల సాకారం కావడంతో సంబురాలు చేసుకున్న లబ్ధిదారులు
- సీఎం కేసీఆర్ పదికాలాల పాటు సల్లంగా ఉండాలని దీవెన


లోపలి పేజీల్లో..


తెలంగాణ సర్కార్ నిరుపేదలకు సొంతిండ్లను కానుకగా ఇవ్వగా.. లబ్ధిదారుల కండ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నో ఏండ్లుగా సంపాదనలో సగం ఇంటి కిరాయికే చెల్లించి.. బతుకు బండిని భారంగా లాగిస్తున్న పేదల కుటుంబాలు సంబురాలు చేసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో సోమవారం మూడో విడుత రెండు పడకల ఇండ్ల పంపిణీ కార్యక్రమం ఎంతో అట్టహాసంగా జరిగింది. మహేశ్వరం నియోజకవర్గంలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లి మండలంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను అందజేశారు. అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నార్సింగి, బైరాగిగూడల్లో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నలగండ్లలో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం దేశానికే ఆదర్శమని కొనియాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ, తాగునీరు వంటి సకల సదుపాయాలతో ఇండ్లను నిర్మించి ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట తప్పరని, ఇప్పటివరకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల సీఎం కేసీఆర్‌తోనే నెరవేరుతున్నదన్నారు. ఇతర ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నిరుపేదలకు వరం డబుల్ బెడ్రూం ఇండ్లు అని అన్నారు. ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పదికాలాల పాటు సల్లంగా ఉండాలని దీవించారు.

–రంగారెడ్డి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ)




శంకర్‌పల్లిలో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



నార్సింగిలో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి



అబ్దుల్లాపూర్‌మెట్‌లో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా



అబ్దుల్లాపూర్‌మెట్‌లో హాజరైన లబ్ధిదారులు